క్లుప్తంగా

అప్‌గ్రేడ్‌లో ఎవరి ప్రమేయమూ ఉండదు..

మణుగూరుటౌన్: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో మొత్తం 32 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు మెయిన్ అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ అయ్యాయని, నిబంధనల ప్రకారం జరిగే అప్‌గ్రేడ్‌లో ఎవరి ప్రమేయం ఉండదని ఐసీడీఎస్ సీడీపీఓ జయలక్ష్మి శనివారం తెలిపారు. అశోక్‌నగర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మినీ టీచర్ల అప్గ్రేడ్ విషయంలో ఓ అజ్ఞాత వ్యక్తి వసూళ్లకు పాల్పడుతున్నాడని వస్తున్న పుకార్లు వస్తున్నాయని, అలాంటివి ఏమైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో జయలక్ష్మి, లక్ష్మి, శ్రావణి, చంద్రకళ, లక్ష్మి, సుజాత, సులోచన, ఎం.అరుణ తదితరులు ఉన్నారు.

ఉత్సవాలు ప్రారంభం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారంవారిగూడెం కాలనీ వద్దగల ఆదిపరాశక్తి విజయ భవాని అమ్మవారి ఆలయంలో శనివారం నుంచి జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. తెల్లవారుజాము నుంచే వివిధ గ్రామాల నుంచి భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకొగా, అర్చకుల ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం అమ్మవారికి కలశ స్థాపనతో ప్రదీక్షణలు, అఖండ దీపారాధాన చేసి సహస్ర కుంకుమార్చనలు జరిపించారు. సాయంత్రం అమ్మవారికి చండీ మూలమంత్ర సహిత వనదుర్గా హోమాన్ని నిర్వహించి, మంగళహారతులు పట్టారు. అలాగే భక్తులకు తీర్థ ప్రసాదాలను ఆలయ ధర్మలు గేదల విష్ణుమూర్తి, సరోజిని దంపతుల చేతుల మీదుగా పంపిణీ చేశారు.

బహుమతి ప్రదానం

కరకగూడెం: మండలంలోని భట్టుపల్లి కేజీబీవీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పూనెం ప్రణీత ఇటీవల కొత్తగూడెంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్పెల్ విజర్డ్ పోటీలో స్ట్రీమ్ 2లో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. విషయం తెలుసుకున్న ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యాక్షుడు షేక్ మీరా హుస్సేన్ ఆధ్వర్యంలో శనివారం మణుగూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణ జ్యోతి చేతుల మీదుగా ప్రశంసాపత్రం, బహుమతి అందజేశారు. ఎస్ఈఆర్టీ తెలంగాణ సభ్యులు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శ్రీదేవి, గైడ్ ఇంగ్లీష్ టీచర్ వసుధ లయన్స్ క్లబ్ మణుగూరు ప్రెసిడెంట్ గాజుల పూర్ణ చందర్ రావు ఉపాధ్యాయులు సావిత్రి,రాజ్యలక్ష్మి, జ్యోతి, ధన లక్ష్మి, కల్పన, రమణ, పీఈటీ కవిత, విద్యార్థిని తల్లిదండ్రులు సుజాత, వేణు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని మల్లేపల్లి ఓసిలో ఓబి పనులు నిర్వహిస్తున్న మహాలక్ష్మి కంపెనీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ ఓబీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు సింగరేణి యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఈ మేరకు మల్లేపల్లి ఓసి మేనేజర్ రాజేశ్వరరావుకు యూనియన్ నాయకులు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. ఓబి కార్మికులకు ట్రిప్ కౌంటర్లు, స్పాటర్లు, షెల్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. సానుకూలంగా స్పందించిన గని మేనేజర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. యూనియన్ నాయకులు బాపనపల్లి మహేష్, కర్రీ నగేష్, తమ్మిశెట్టి ఉప్పయ్య, సంపత్ రాజ్, తడికల స్వామి, సంగీత్, సతీష్‌చారి, ఓబి కార్మికులు పాల్గొన్నారు.

పోరాడడమే నివాళి

భద్రాచలంఅర్బన్: నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడటమే ముదిగొండ నాగేశ్వరరావుకు ఇచ్చే ఘన నివాళి అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం సీపీఎం మాజీ పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు ముదిగొండ నాగేశ్వరరావు 8వ వర్ధంతి సభ పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన భద్రాచలం పట్టణంలో జరిగింది. ముందుగా ముదిగొండ నాగేశ్వరరావు స్మారక స్థూపం వద్ద పార్టీ పతాకాన్ని మచ్చా వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. నాగేశ్వరరావు చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు, మాజీ డీసీసీబీ చైర్మెన్ యలమంచి రవికుమార్ పూలమాల వేసి నివాళులుర్పించారు. అనంతరం జరిగిన సభలో రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడారు. పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు బి.వెంకటరెడ్డి, వై.వెంకటరామారావు, ఎన్.లీలావతి, పట్టణ కమిటీ సభ్యుడు ఎన్.నాగరాజు, కుంజా శ్రీనివాస్, కోరాడ శ్రీనివాస్, ఎస్.భూపేంద్ర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కేంద్రం తీరుపై నిరసన

బూర్గంపాడు: రైతులపై, కార్మికులపై కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న నిరంకుశ విధానాలను తిప్పికొట్టాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఐఎఫ్‌టీయు, ఏఐకేఎంఎస్ నాయకులు వైఎస్ రెడ్డి, జక్కుల రాంబాబు పిలుపునిచ్చారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న రైతులపై కాల్పులకు పాల్పడిన కేంద్ర ప్రభుత్వ దమనకాండను నిరసిస్తూ లక్ష్మీపురంలో శనివారం నల్ల జెండాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బర్ల రామకృష్ణ, రాము, మధు, వినోద్, రాములు, రమేష్, తరుణ్, పవన్, సుక్కయ్య, శ్రీనివాస్, మల్లయ్య పాల్గొన్నారు.

జాతరకు వేళాయె!

- మారాయిగూడెంలో 26 నుంచి సమ్మక్క జాతర
- మేడారంలో ముగిశాక ఇక్కడ నిర్వహణ
- ఐదు రోజుల జాతరకు తరలి రానున్న ఐదు రాష్ట్రాల భక్తులు


జాతరలో వనదేవతను తీసుకొస్తున్న భక్తులు (ఫైల్)


జాతరకు సిద్ధం చేసిన అమ్మవారి గద్దెలు

దుమ్ముగూడెం: ఆదివాసీల ఇలవేల్పు మినీ మేడారంగా ప్రసిద్ధిగాంచిన మారాయిగూడెం సమ్మక్క-సారలమ్మ మినీ జాతరను నిర్వహించడానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. పెద్ద మేడారం జాతర ముగిసిన తరువాత నిర్వహించే మారాయిగూడెం మినీ మేడారానికి భారీ సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవార్లను దర్శించుకుని తమ మొక్కులను చెల్లించుకుంటారు. దేవర బాలలుగా సోడి శాంతమ్మ, మడకం అచ్చమ్మ, నాగులమ్మగా తిమ్మ శాంతమ్మల పర్యవేక్షణలో ప్రతీ జాతరను నిర్వహిస్తారు.

మారాయిగూడెం మినీ మేడారం జాతరకు వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి అమ్మవార్లను దర్శించుకుని తమ మొక్కులను చెల్లించుకుంటారు. ఫిబ్రవరి 27వ తేదీ నుంచి మార్చి 2వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జాతరను నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను చేశారు. ఆలయ ప్రాంగణంలోని గద్దెలకు నూతన రంగులు వేసి అలంకరించారు.జాతర విషయాలను తెలిసేలా వాల్ పోస్టర్ల ద్వారా ప్రచార కార్యక్రమం చేపట్టారు.

జాతర జరిగేది ఇలా..

ఫిబ్రవరి 27వ తేదీ మంగళవారం మండమెలగడంతో జాతరను ప్రారంభిస్తారు. 28వ తేదీన బుధవారం రాత్రి 10గంటలకు దేవతా నిశానులు సారలమ్మ తల్లిని గుడికి తీసుకొస్తారు. అలాగే, 29వ తేదీ గురువారం సాయంత్రం 4గంటలకు సమ్మక్క తల్లిని గుట్ట నుంచి తీసుకోరావడంతో నిండు జాతర ప్రారంభమవుతుంది. మార్చి 1వ తేదీన భక్తులు మొక్కులను చెల్లించుకున్నాక, 2వ తేదీన తల్లి గుట్టకు వెళ్లడంతో జాతర ముగుస్తుంది. కాగా, జాతర జరిగే ఐదు రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో గిరిజన సంస్కృతిక కార్యక్రమాలను ఆకట్టుకుంటాయి.

ఐదు రాష్ట్రాల ప్రజలు రాక..

మినీ మేడారంగా ప్రసిద్ధిగాంచిన మారాయిగూడెం సమ్మక్క-సారలమ్మ జాతరకు ఐదు రాష్ట్రాలకు చెందిన వేల మంది ప్రజలు తరలివచ్చి తమ మొక్కలను చెల్లించుకుంటారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన ఆదివాసీలు జాతరకు హాజరై తమ మొక్కులను చెల్లించుకుంటారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ జాతరకు వచ్చే భక్తుల కోసం ఆలయ కమిటీ తగిన ఏర్పాట్లు చేయనుంది. వేలాదిగా తరలివచ్చే భక్తుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను చేస్తున్నారు.

జాతరకు సర్వం సిద్ధం..



మారాయిగూడెంలో నిర్వహించే సమ్మక్క-సారలమ్మ అమ్మవారి జాతరకు సర్వం సిద్ధం చేశాం. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. జాతర ఐదు రోజుల పాటు రాత్రి వేళల్లో గిరిజన సంప్రదాయ నృత్యాలతో భక్తులను అకట్టుకోనున్నాయి.

– సోడి శాంతమ్మ-మడకం అచ్చమ్మ, దేవర బాలలు

తాగునీటి ఇబ్బంది తీర్చాలి



మారాయిగూడెంలో జరిగే శ్రీసమ్మక్క-సారలమ్మ మినీ జాతరకు పంచాయతీ తరుపున తాగునీటి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఆలయ ప్రాంగణంలో ఉన్న ఒక్క బోర్‌తో జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది ఏర్పడుతుంది. మరో బోర్ ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తప్పుతాయి.

– అప్కా వీర్రాజు, ఆలయ కమిటీ సభ్యుడు

ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లిలో మార్చి నెలలో జరగనున్న బాలాజీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను, భ్రమరాంబసమేత మల్లికార్జున స్వామి వారి శివారాత్రి ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సూచించారు. శనివారం బాలాజీ ఆలయంలో ఉత్సవాలపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలను ఏర్పాటు చేసి, కమిటీ సభ్యుల పేర్లను వెల్లడించారు. ఉత్సవాల నిర్వహణ పై అధికారులకు పలు సూచనలు చేశారు. ఉత్సవాల కోసం భక్తులకు ఇబ్బందులు కలగకుండా రహదారుల మరమ్మతుల కోసం రూ.35 లక్షలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర ప్రసాద్, ఎంపీడీఓ మహాలక్ష్మి, ఎస్సై షాహీన, విద్యుత్ శాఖ ఏఈ తరుణ్, వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక, ఆర్అండ్‌బీ ఏఈ లక్మానాయక్, ఆలయ మేనేజర్ రమణ, నాయకులు వనమాగాంధీ, భీముడు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

అశ్వారావుపేటరూరల్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్‌కు పునాది పడుతుందని, క్రమ శిక్షణతో చదివి లక్ష్యాలను నిర్దేశించుకోవాలని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలంలోని మద్దికొండ (భీమునిగూడెం) గ్రామంలో ఐటీడీఏ బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం జరిగిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముందుగా ఆశ్రమ పాఠశాలలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఆపై అచ్యుతాపురం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు కాసాని దుర్గ, మాజీ సర్పంచ్ తాటి భవాని, కాంగ్రెస్ నాయకులు జూపల్లి ప్రమోద్, మురళి, గ్రామపెద్దలు హరిబాబు, నాగేంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బలరాంనాయక్‌కే టికెట్ ఇవ్వాలి

మణుగూరుటౌన్: మహబూబాబాద్ పార్లమెంట్ ఎంపీ టికెట్ కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పోరిక బలరాం నాయక్‌కే కేటాయించాలని మణుగూరు మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు బానోత్ లక్ష్మణ్, కురం రవి, ఆవుల సర్వేశ్వరరావు, నూరుద్దీన్, రామిరెడ్డిలు అధిష్టానాన్ని కోరారు. శనివారం ప్రజా భవన్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. పార్టీని అంటిపెట్టుకుని ఉంటూ కష్టపడి పనిచేసిన వారికి కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. గతంలో కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు బలరాం నాయక్ మహబూబాబాద్ నియోజకవర్గానికి భారీగా కేంద్ర నిధులు తీసుకువచ్చి ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో బలరాం నాయక్ విధేయతను దృష్టిలో పెట్టుకుని ఆలోచించి టికెట్ కేటాయించాలని కోరారు. సూరయ్య, దేవ కిరణ్, రేసు ఉప్పలయ్య, వేణు, సతీశ్ తదితరులున్నారు.

యాత్రను జయప్రదం చేయండి

మణుగూరురూరల్: రాష్ట్ర వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ నేతలు చేపడుతున్న విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు కోరారు. శనివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్‌లో బీజేపీ విజయం కోసమే ఈ యాత్ర అన్నారు. ఎన్నికల ముందుకు ప్రతీ కార్యకర్త ఇంటింటికీ కరపత్రాల ప్రచారం నిర్వహించి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు ప్రభారి కృష్ణవేణి నాయక్, పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ పి.బిక్షపతి, జిల్లా ఉపాధ్యక్షుడు దేవేంద్ర వరప్రసాద్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సరస్వతి, పట్టణ అధ్యక్షుడు లింగంపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి ప్రధానిగా నరేంద్రమోదీ..

అశ్వాపురం: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో గెలుపుతో మూడో సారి భారత ప్రధానిగా నరేంద్రమోదీ మళ్లి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని బీజేపీ క్రమశిక్షణ సంఘం చైర్మన్, కాకతీయ క్లస్టర్ ఇంచార్జ్ మార్తినేని ధర్మారావు అన్నారు. అశ్వాపురంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ విజయసంకల్ప యాత్రలో భాగంగా నేడు సాయంత్రం నాలుగు గంటలకు మణుగూరు పట్టణంలో అంబేద్కర్ సెంటర్‌లో బైక్ ర్యాలీ, కార్నర్ సమావేశానికి ముఖ్య అతిథిగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి హాజరవుతున్నట్టు తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, మహబూబాబాద్ పార్లమెంటు కన్వీనర్ ముస్కు శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపాముల అయిలయ్య, నియోజకవర్గ కన్వీనర్ పున్నం భిక్షపతి, జిల్లా ఉపాధ్యక్షుడు దేవేంద్రవరప్రసాద్, నాయకులు పొడియం బాలరాజు, బండ్ల నాగేశ్వరరావు, కోలా భాస్కర్, సుధాకర్‌రెడ్డి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


మణుగూరురూరల్: మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ధర్మారావు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అశ్వారావుపేటరూరల్: మరమ్మతుల కారణంగా నేడు(ఆదివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు స్థానిక ట్రాన్స్‌కో ఏడీఈ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అశ్వారావుపేటలోని 33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని పేరాయిగూడెం, అశ్వారావుపేట 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులంతా గమనించి, సహకరించాలని కోరారు.

పాఠశాలలో సైన్స్ ఫెయిర్

దమ్మపేట: మండల కేంద్రంలోని స్థానిక సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులతో సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారిని కీసర లక్ష్మి, దమ్మపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం ఉషారాణి హాజరయ్యారు. సైన్స్ ఫెయిర్ ప్రదర్శనను తిలకించడానికి మండలంలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. వందకు పైగా సైన్స్ కృత్యాలను విద్యార్థులు ప్రదర్శించగా, చూపరులను ఆకట్టుకున్నాయి. సైన్స్ కృత్యాలను పరిశీలించిన ఎంఈఓ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ సాజు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేగులగండిలో వైద్యశిబిరం

మణుగూరుటౌన్: సింగరేణి సేవా సమితి, వైద్య ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మణుగూరు మండల పరిధిలోని కూనవరం పంచాయతీలోని రేగులగండి గిరిజన గ్రామంలో శనివారం సింగరేణి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ వైద్యుడు రవికుమార్ 41 మంది గ్రామస్తులకు ఉచిత వైద్య సేవలందించి బీపీ, షుగర్‌తో పాటు సీజనల్ వ్యాధులకు మందులు అందించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ.. సింగరేణి తన బాధ్యతగా ప్రభావిత గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణవేణి, శ్రీకాంత్, సేవా సమితి కో-ఆర్డినేటర్ వెంకట మారేశ్వర రావు ఉన్నారు.

మెడికల్ పుస్తకాలు అందించాలి

మణుగూరుటౌన్: మల్లేపల్లి మహాలక్ష్మి కంపెనీ కాంట్రాక్ట్ కార్మికులకు మెడికల్ పుస్తకాలు అందించాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ ఓబీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు శనివారం మణుగూరు ఓసీ మేనేజర్ రాజేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. మెడికల్ పుస్తకాలు లేక కార్మికులపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గించాలని వివరించారు. వేసవి కాలంలో కార్మికులకు కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారు. స్పందించిన అధికారి పై అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. బాపనపల్లి మహేశ్, నగేశ్ నాయుడు, తమ్మిశెట్టి ఉప్పయ్య, సంపత్ రాజ్, స్వామి, సంగీత్, సతీష్ చారి, ఓబీ కార్మికులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజ మార్గం


మణుగూరురూరల్: మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు


భద్రాచలంఅర్బన్: ఫ్రీ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి సూరిరెడ్డి

మణుగూరురూరల్: రాజీ మార్గమే రాజమార్గమని మణుగూరు ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మణుగూరు కోర్ట్ ఆవరణలో మండల లీగల్ ఎయిడ్ సెల్ ఆధ్వర్యంలో ఫ్రీ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్షణికావేశంలో జరిగే తప్పు ఒప్పులను పంతాలకు, పట్టింపులకు పోయి పెద్దవి చేసుకోవద్దన్నారు. శాంతియుత వాతావరణంలో పెద్దల సమక్షంలో సమావేశమై రాజీ కుదుర్చోవాలన్నారు. క్షణికావేశంలో కేసులు పెట్టుకుని ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను సైతం కక్షిదారులు ప్రశాంత వాతావరణంలో సంధి చేసుకుని క్అదాలత్ ద్వారా రాజీ చేసుకుని కేసులు కొట్టి వేయించుకుని ప్రశాంత జీవనం గడపాలన్నారు. రాజీ కేసుల విషయంలో మండల లీగల్ ఎయిడ్ సెల్ సిబ్బంది, పోలీస్ అధికారులు, కోర్ట్ కానిస్టేబుల్ సహకరించేందుకు ఎప్పుడు సిద్ధంగా ఉంటారన్నారు. చిన్న చిన్న విషయాలకు పోలీస్టేషన్, కోర్ట్ వరకు రాకుండా రాజీ చేసుకుని అమూల్యమైన సమయాన్ని, నగదును వృథా చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చిర్ర రవి, లీగల్ ఎయిడ్ మండల సభ్యులు సర్వేశ్వరరావు, న్యాయవాదులు వాసవి, పోశం భాస్కర్, మూర్తి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలును సందర్శించిన జడ్జి

భద్రాచలంఅర్బన్: జ్యుడిషల్ మెజిస్ట్రేట్, స్థానిక జడ్జి సూరిరెడ్డి శనివారం భద్రాచలం స్పెషల్ సబ్ జైలును సందర్శించారు. జైలులో ఉన్న అండర్ ట్రయల్ ముద్దాయిలను కలిసి వారి బాగోగులు గురించి, ఆహారం, వసతులు, లీగల్ ఎయిడ్ సహాయం వంటి వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ముద్దాయిలకి ఉన్న వసతుల్లో లైబ్రరీ, యోగ, ములాకత్ వంటి కూడా కల్పిస్తున్నామని జైల్ సూపరింటెండెంట్ ఉపేందర్ జడ్జికి వివరించారు. కార్యక్రమం అనంతరం జ్యూడిషల్ కోర్టులో ఫ్రీ లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేశారు. వచ్చే మార్చి 9న నిర్వహించాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని శనివారం ముందుగా ఫ్రీలోక్ అదాలత్ ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్జితో పాటు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసెక్యూటర్ సాంబ దుర్గబాయ్, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నవీన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మల వనప్రవేశం

మణుగూరురూరల్: మండల పరిధిలోని మినీమేడారంగా పేరొందిన తోగ్గూడెం శ్రీసమ్మక్క-సారలమ్మ జాతర మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగి శనివారం వనదేవతల వనప్రవేశంతో ముగిసింది. జాతర సమయంలో గద్దెల పై కొలువు దీరిన అమ్మవార్లను దర్శించుకుని వేలాది మంది భక్తులు తరలివచ్చారు. మేడారాన్ని తలపించేలా భక్తులు పోటెత్తడంతో తోగ్గూడెం సమ్మక్క-సారలమ్మ దేవాలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. జాతర ముగింపు రోజైన శనివారం గిరిజన సంస్కృతి సంప్రదాయాలు, మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ ఆలయ పూజారులు, ఆలయ కమిటి సభ్యులు సమ్మక్క-సారలమ్మలను వనంలోని సాగనంపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ వారు, ప్రజాప్రతినిధులు, సింగరేణి, పోలీస్, రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేయడంపై పలువురు అభినందనలు తెలిపారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి నేతృత్వంలో సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్‌శాఖ బందోబస్త్ చర్యలు చేపట్టింది.

పొదెంకు మంత్రి పదవి ఇవ్వాలి


మోకాళ్లపై రామయ్య ఆలయ మెట్లు ఎక్కుతున్న కాంగ్రెస్ నాయకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ ఉపాధ్యాక్షుడు పొదెం వీరయ్యకు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ డివిజన్ నాయకులు శనివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. మోకాళ్లపై రామయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఎన్నో అవమానాలకు, అవహేళనలకు కష్టాలకు గురి చేసిన అన్నింటినీ భరిస్తూ.. వారి ప్రలోభాలకు లొంగకుండా పార్టీ మారకుండా కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఉన్న వ్యక్తి పొదెం వీరయ్య అని పేర్కొన్నారు. భద్రాచలం అభివృద్ధి కోసం కాంగ్రెస్ అధిష్టానం వీరయ్య విధేయతను గుర్తించి ఎమ్మెల్సీ చేసి మంత్రి పదవి వచ్చేలా చూడాలని భద్రాద్రి రామయ్యను కోరిన్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో తరుణ్ మిత్ర, అడబాల వెంకటేశ్వరరావు, సరిత, పిలకా వెంకటరమణారెడ్డి, మణి, జయ, లక్ష్మి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

చర్ల: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముభారక్ లబ్ధిదారులకు శనివారం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చెక్కులను అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని 39 మంది కల్యాణలక్ష్మి, ఇద్దరు షాదీముభారక్ లబ్ధిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు ఈ పథకం వరం లాంటిదని అన్నారు. అర్హులైన లబ్ధిరులందరూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గీదా కోదండరామయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు ఇర్పా శాంత, తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ బి.భరణిబాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరావు, వరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు మడకం పద్మజ, మిడియం శోబారాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

బూర్గంపాడు: సారపాక సత్యధామంలోని సత్యనారాయణస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మంగళవాయిద్యాలతో స్వామివారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. శుక్రవారం రాత్రి రమా సహిత సత్యనారాయణస్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలలో భక్తులు, పుర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాలాజీ వేంకటేశ్వర కల్యాణం


అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు. స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామి వారి కల్యాణం అనంతరం ఆలయ అధికారులు భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

తిరుపతమ్మ-గోపయ్య స్వామి కల్యాణం

మండల కేంద్రంలోని అంకమ్మ తల్లి ఆలయంలో తిరుపతమ్మ, గోపయ్య స్వామి కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. శనివారం ఆలయంలో జీవధ్వజ స్తంభ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో అమ్మ వార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమలను నిర్వహించారు. ఆలయంలో అమ్మ వారికి మహిళలు బోనాలను సమర్పించారు. అనంతరం తిరుపతమ్మ, గోపయ్య కల్యాణాన్ని అర్చకులు జరిపించారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, కల్యాణం తిలకించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.